
జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..


నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 13 | పేజీలు : 5 | బుధవారం 21 జనవరి 2026 | వెల : 2/-

## కేటీఆర్‌ను ఆలింగనం చేసుకున్న హరీశ్ రావు



- సిట్ విచారణ అనంతరం నేరుగా బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చిన హరీశ్ రావు
- తన కోసం వేచి చూస్తున్న కేటీఆర్ వద్దకు వెళ్లి ఆలింగనం చేసుకున్న హరీశ్ రావు
- హరీశ్ రావును సుమారు ఏడు గంటల పాటు విచారించిన సిట్ బృందం

వివరాలు 2 లో..




## ఫ్యూచర్ సిటీ కోసం తెలంగాణ ప్రభుత్వంతో చేతులు కలిపిన యూఏఈ

- రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందాన్ని కలిసిన యూఏఈ మంత్రి
- ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లడానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలన్న మంత్రి
- తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాన్ని వివరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

డెస్క్, జనవరి 20 (తొలి వెలుగు) : భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దేశ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదికఉ 2026 సదస్సులో భాగంగా, దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంతో యూఏఈ మంత్రి మంగళవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్రధానంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చలు జరిపారు. ఈ సందర్భంలో సీఎం రేవంత్ యూఏఈ ప్రతినిధి బృందానికి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అంశాలను ప్రస్తావిస్తూ, ఇది దేశంలోనే తొలి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30,000 ఎకరాల్లో విస్తరించే ఫ్యూచర్ సిటీలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాసం, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్...

2

## ఫోన్ ట్యాపింగ్‌పై కవిత ప్రశ్నలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పలేకపోతున్నారు - అద్దంకి దయాకర్

- హరీశ్ రావుపై అద్దంకి దయాకర్, బీర్ల ఐలయ్య, బల్మూరి వెంకట్ ఆగ్రహం
- ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేయించారని కవిత ఆరోపించారన్న కాంగ్రెస్ నాయకులు
- హరీశ్ రావు బాధితుడైతే వివరాలు చెప్పాలి, బాధ్యుడైతే సమాధానం చెప్పాలని డిమాండ్



డెస్క్, జనవరి 20 (తొలి వెలుగు) : ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేయించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారని, ఆమె వేసిన ప్రశ్నలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పలేకపోతున్నారని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, బీర్ల ఐలయ్య, బల్మూరి వెంకట్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావును సిట్ విచారిస్తోంది. విచారణకు హాజరు కావడానికి ముందు హరీశ్ రావు చేసిన విమర్శలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ రావు బాధితుడైతే వివరాలు చెప్పాలని, బాధ్యుడైతే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేసు కొత్తదేమీ కాదని, గత రెండేళ్లుగా దీనిపై విచారణ సాగుతోందని అన్నారు. హరీశ్ రావు తనకు తాను పోరాట యోధుడిలా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు ఫోన్లు ట్యాప్ చేయించారని ఆరోపించారు. ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేయించారని స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పారని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ అంటూ కాంగ్రెస్ డ్రామాలు చేస్తోందని హరీశ్ రావు అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డిని ఎలా వేధించారో అందరికీ తెలిసిందేనని అన్నారు. ముఖ్యమంత్రిపై ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హరీశ్ రావుకు నిజాయతీ ఉంటే ప్రజల సొమ్మును దోచుకోలేదని ప్రమాణం చేయాలని వారు అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తప్పు చేయకుంటే విచారణను ఎదుర్కోవడానికి భయమెందుకని ప్రశ్నించారు. తాము కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ నేతలు బయట కూడా తిరగలేరని వారు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అధికారులతో తప్పుడు పనులు చేయించి వారిని అబాసుపాలు చేశారని అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి కేసీఆరే కారణమని ఆరోపించారు. తప్పు చేసిన వారికి ఎవరికైనా శిక్ష పడటం ఖాయమని అన్నారు.

## బలవంతంగా ట్రాఫిక్ చలాన్లు వసూలు చేయవద్దు

- హైకోర్టు కీలక ఆదేశాలు






- వాహనం లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదన్న హైకోర్టు
- వాహనదారుడు చెల్లిస్తేనే చలానా మొత్తం తీసుకోవాలన్న హైకోర్టు
- వాహనదారుడికి చెల్లించడం ఇష్టంలేకపోతే నోటీసులు జారీ చేయాలన్న హైకోర్టు

డెస్క్, జనవరి 20 (తొలి వెలుగు) : తెలంగాణ హైకోర్టు వాహనాల పెండింగ్ చలాన్లపై కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల విషయంలో వాహనదారులను బలవంత పెట్టవద్దని ట్రాఫిక్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ట్రాఫిక్ పోలీసులు బలవంతంగా చలాన్లు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. పెండింగ్ చలాన్ల వసూలు కోసం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ట్రాఫిక్ పోలీసులకు ఈ ఆదేశాలు జారీ చేసింది. చలాన్లు చెల్లించాలని వాహనాల తాళాలు లాక్కోవడం, వాహనాన్ని ఆపడం వంటి చర్యలకు పాల్పడవద్దని ట్రాఫిక్ పోలీసులకు సూచించింది. వాహనం ఆపినప్పుడు వాహనదారు స్వచ్ఛందంగా చలాన్లు చెల్లిస్తే పోలీసులు వసూలు చేయవచ్చని పేర్కొంది. వాహనదారులు చలానా చెల్లించడానికి ఇష్టపడకుంటే చట్ట ప్రకారం వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది.

## అది సిట్ కాదు.. పిచ్చి విచారణ - కేటీఆర్

- హరీశ్ రావు సిట్ విచారణపై కేటీఆర్ ఆగ్రహం
- అది సిట్ విచారణ కాదు, పిచ్చి విచారణ అని వ్యాఖ్య
- సింగరేణి టెండర్ల స్కాంలో సీఎం బావమరిది సూత్రధారి అని ఆరోపణ
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్



2

## 233 ఏళ్ల నాటి రామాయణ గ్రంథం

- అయోధ్య మ్యూజియంకు అరుదైన కానుక



- సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి శాశ్వత బహుమతిగా అందజేత
- 1792 నాటి ఈ గ్రంథంలో ఐదు ప్రధాన కాండలు
- ఇది చారిత్రక ఘట్టమని అభివర్ణించిన నృపేంద్ర మిశ్రా గతంలో ఈ గ్రంథం రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శన

వివరాలు 2 లో..

# కేటీఆర్‌ను ఆలింగనం చేసుకున్న హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 20 (తొలి వెలుగు) : ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావును సుమారు ఏడు గంటలు పాటు విచారించింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6.25 గంటల వరకు సిట్ అధికారులు హరీశ్ రావును ప్రశ్నించారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఇంటి నుంచి తెప్పించిన భోజనాన్ని అనుమతించారు. హరీశ్ రావు విచారణకు హాజరైన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్దకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. సిట్ విచారణ అనంతరం హరీశ్ రావు నేరుగా బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు వేచి ఉన్నారు. కార్యాలయంలో కేటీఆర్‌ను చూడగానే హరీశ్ రావు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. వారిద్దరి అనుబంధాన్ని చూసి అక్కడున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# అది సిట్ కాదు.. పిచ్చి విచారణ - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవారి 19 (తొలి వెలుగు) : తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్ రావును సిట్ విచారించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది సిట్ విచారణ కాదని, పిచ్చి విచారణ అని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. న్యాయం కోసం హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకైనా వెళతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతోందని ఆరోపించారు. సింగరేణి టెండర్ల కుంభకోణంలో అసలు సూత్రధారి ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డేనని సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# 233 ఏళ్ల నాటి రామాయణ గ్రంథం..

## - అయోధ్య మ్యూజియంకు అరుదైన కానుక

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 20 (తొలి వెలుగు) : అయోధ్యలోని అంతర్జాతీయ రామకథా సంగ్రహాలయానికి (మ్యూజియం) ఒక అరుదైన, చారిత్రక కానుక అందింది. 233 ఏళ్ల నాటి పురాతన వాల్మీకి రామాయణ సంస్కృత గ్రంథాన్ని కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయం మంగళవారం శాశ్వతంగా బహూకరించింది. ఢిల్లీలోని తీన్‌మూర్తి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ గ్రంథాన్ని ప్రధానుల మ్యూజియం, లైబ్రరీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రాకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస వరఖేడి అందజేశారు.

మహేశ్వర తీర్థ రచించిన 'తత్త్వదీపిక' వ్యాఖ్యానంతో కూడిన ఈ వాల్మీకి రామాయణం దేవనాగరి లిపిలో ఉంది. విక్రమ సంవత్సరం 1849, అంటే 1792లో దీనిని రచించినట్లు ఆధారాలున్నాయి. ఈ గ్రంథంలో బాలకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ అనే ఐదు ప్రధాన కాండలు ఉన్నాయి. గతంలో దీనిని రాష్ట్రపతి భవన్‌కు అప్పుగా ఇవ్వగా, ఇప్పుడు శాశ్వతంగా అయోధ్య మ్యూజియానికి అందజేశారు.

ఈ సందర్భంగా రామ మందిర నిర్మాణ కమిటీ ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్న నృపేంద్ర మిశ్రా మాట్లాడుతూ, "ఈ అరుదైన గ్రంథాన్ని అయోధ్యకు బహూకరించడం రాముడి భక్తులకు, ఆలయ సముదాయానికి ఒక చారిత్రక ఘట్టం" అని అన్నారు. ప్రాచీన వారసత్వాన్ని ఆధునిక టెక్నాలజీతో జోడించి, అయోధ్యలోని రామకథా సంగ్రహాలయాన్ని ప్రపంచ స్థాయి మ్యూజియంగా తీర్చిదిద్దే పనులను ఆయన పర్యవేక్షిస్తున్నారు.

"ఈ బహుమతి ద్వారా వాల్మీకి రామాయణంలోని జ్ఞాన సంపదను ప్రపంచవ్యాప్తంగా పండితులు, భక్తులకు అయోధ్య పుణ్యక్షేత్రంలో అందుబాటులోకి తెచ్చినట్లయింది" అని వీసీ శ్రీనివాస వరఖేడి తెలిపారు. 1988లో ప్రారంభమైన ఈ మ్యూజియంలో రాముడి కథకు సంబంధించిన అనేక కళాఖండాలను భద్రపరిచి, ప్రదర్శిస్తున్నారు.

# సిట్ నన్ను అడగడం కాదు.. నేనే సిట్‌కు వంద ప్రశ్నలు వేశా

## - ఏడు గంటల విచారణ అనంతరం హరీశ్ రావు

డెస్క్, జనవరి 20 (తొలి వెలుగు) : ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తనను ప్రశ్నించడం కాదని, తానే సిట్‌కు వంద ప్రశ్నలు వేశానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. దమ్ముంటే ఈరోజు విచారణకు సంబంధించిన వీడియోలను విడుదల చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాను హోంమంత్రిగా ఎప్పుడైనా పని చేశానా అని వ్యాఖ్యానించారు. నాటి డీజీపీ, చీఫ్ ఇంటెలిజెన్స్‌ను కూడా విచారణకు పిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు దాదాపు ఏడు గంటల పాటు విచారించారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నోటీసులు, విచారణలు బీఆర్ఎస్‌ను భయపెట్టలేవని ఆయన అన్నారు. రేపు ప్రజా కోర్టులో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల గురించి మంత్రులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

అరెస్టులు తమకు కొత్తేమీ కాదని ఆయన అన్నారు. ముగ్గురు అధికారులతో కూడిన సిట్ దర్యాప్తు బృందం తనను ప్రశ్నించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాయతీపరుడైతే ఈ అంశంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిరికిపందలా పోలీసులను వెనుకబెట్టుకుని కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. చట్టంపై తమకు గౌరవం ఉందని, సిట్ అధికారులు ఎన్నిసార్లు పిలిచినా విచారణకు హాజరవుతానని ఆయన అన్నారు.



వారి కుంభకోణాలు, చీకటి రాజకీయాలను బయటపెడుతున్నామని తమపై కేసులు పెడుతున్నారని హరీశ్ ఆరోపించారు. మీ దోపిడీలను ప్రశ్నిస్తున్నామని, మాపై కేసులు పెడతారా అని నిలదీశారు. తమపై అన్నీ నిరాధార ఆరోపణలేనని, సొల్లు పురాణాలేనని విమర్శించారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాష వింటేనే రోత పుడుతోందని అన్నారు.

రేవంత్ రెడ్డిలా తమకు వెన్నుపోట్లు తెలియవని, పోరాటాలు మాత్రమే తెలుసని ఆయన అన్నారు. కేసీఆర్ తమకు నేర్పింది పోరాటమే అన్నారు. ఇప్పుడు తనకు సిట్ ద్వారా వచ్చిన నోటీసులు మీ పతనానికి నాంది అని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ధైర్యం ఉంటే తమను రాజకీయంగా ఎదుర్కోవాలని అన్నారు. మీ చిల్లర, బురద, కుట్ర, కుతంత్రాల రాజకీయాలు ఇక నడవవని అన్నారు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు విస్మరించారని ఆరోపించారు.

# నేల విషతుల్యమవుతోంది

## : సీపీఐ నారాయణ

డెస్క్, జనవరి 20 (తొలి వెలుగు) : నేలకొండపల్లిలోని సిద్ధార్థ యోగ విద్యాలయంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుల మందుల అధిక వినియోగంతో నేల విషతుల్యమవుతోందని, దీని ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలాగే ప్రతి రైతు సేంద్రియ సాగు వైపు మళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో అత్యంత సారవంతమైన భూములు ఉన్నప్పటికీ యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాల్సి వస్తోందని నారాయణ అన్నారు. విత్తనాలు, ఎరువుల కంపెనీలు కార్పొరేట్‌ల చేతుల్లో ఉండటంతో లాభాలు బడా కంపెనీలకే చేరుతున్నాయని విమర్శించారు. చివరి ఊపిరి వరకు కమ్యూనిస్టు పార్టీలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ సదస్సులో త్రిదండి శ్రీమన్నారాయణ



చిన్న జీయర్ స్వామి కూడా పాల్గొని ప్రసంగించారు. భూమి పవిత్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, అత్యాశ వల్ల ప్రకృతి సమూల నాశనం అవుతోందని హెచ్చరించారు. హైబ్రిడ్ సాగు, పశుపోషణ వల్ల రోగాలు పెరుగుతున్నాయని, నేటి ఆహారం ఎక్కువగా కలుషితమైందని తెలిపారు. ప్రకృతి బాగుంటేనే మనిషి జీవించగలడని, భూమికీ ప్రాణం ఉందని, దానికి కూడా విరామం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

# దుర్గం చెరువును వారు పట్టించుకోవడం లేదు

## - హైడ్రా కమిషనర్ రంగనాథ్



డెస్క్, జనవరి 20 (తొలి వెలుగు) : దుర్గం చెరువును సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఇక నుంచి ఆ బాధ్యతను తాము తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. దుర్గం చెరువు, పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, నీటిపారుదల, రహేజా అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.

సమీప ప్రాంతాల నుంచి మురుగు నీరు చేరడం వల్లే దుర్గం చెరువులో గుర్రపుడెక్క భారీగా పెరిగిందని రంగనాథ్ అన్నారు. అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు.

దుర్గం చెరువులో గుర్రపుడెక్క పెరగడంతో పర్యాటకం దెబ్బతిన్నది. చెరువులో పర్యాటక బోట్లు కూడా తిరగడం



లేదు. బోటింగ్ లేకపోవడంతో సందర్శనకు వచ్చిన పర్యాటకులు నిరాశతో వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ దుర్గం చెరువును సందర్శించారు.

## సంప్రదాయబద్ధంగా

# శబరిమల ఆలయం మూసివేత

డెస్క్, జనవరి 20 (తొలి వెలుగు) : కేరళలోని ప్రఖ్యాత శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో రెండు నెలలకు పైగా సాగిన మండలం మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర మంగళవారం ఉదయంతో ముగిసింది. సంప్రదాయబద్ధమైన పూజల అనంతరం ఉదయం 6:45 గంటలకు ఆలయ ద్వారాలను మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) ప్రకటించింది. ఆనవాయితీ ప్రకారం పందలం రాజకుటుంబ ప్రతినిధి పునర్తం నాళ్ నారాయణ వర్మ చివరి దర్శనం చేసుకున్న తర్వాత ఆలయాన్ని మూసివేశారు. అంతకుముందు ఉదయం 5 గంటలకు గణపతి హోమంతో నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. ప్రధాన పూజారి (మేల్శాంతి) ఈడీ ప్రసాద్ నంబూద్రి, అయ్యప్ప స్వామి విగ్రహానికి విభూతి



అభిషేకం నిర్వహించి, రుద్రాక్ష మాలతో అలంకరించారు. అనంతరం పవిత్రమైన 'హరివరాసనం' గానం తర్వాత గర్భగుడి తలుపులను మూసివేశారు. ఆలయ తాళపు చెవులను రాజకుటుంబ ప్రతినిధికి అప్పగించగా, ఆయన వాటిని శబరిమల పరిపాలనా అధికారి ఎస్. శ్రీనివాసన్‌కు అందజేశారు. నెలవారీ ఖర్చుల కోసం ఉంచే డబ్బుల సంచిని కూడా ఇదే సమయంలో అప్పగించడం ఇక్కడి సంప్రదాయం. ఇదే సమయంలో పవిత్ర తిరువాభరణాల తిరుగు ప్రయాణం కూడా మొదలైంది. 30 మంది సభ్యుల బృందం ఈ ఆభరణాలను తిరిగి పందలం ప్యాలెస్‌కు తీసుకువెళ్తోంది. ఈ బృందం ఈ నెల 23న పందలం చేరుకుంటుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది మండల-మకరవిళక్కు సీజన్ చాలా ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసిందని టీడీబీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యాత్ర పూర్తయిందని తెలిపారు. పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

### మళ్లీ తెరిచేది ఎప్పుడంటే?

తాజాగా ఆలయాన్ని మూసివేసినప్పటికీ, నెలవారీ పూజల కోసం ఫిబ్రవరిలో మళ్లీ తెరవనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు కుంభం మాసపు పూజల కోసం ఆలయాన్ని తెరిచి, ఫిబ్రవరి 17వ తేదీ రాత్రి 10 గంటలకు తిరిగి మూసివేస్తారు. ఈ సమయంలో భక్తులు దర్శనానికి రావొచ్చని టీడీబీ స్పష్టం చేసింది.

# ఆర్థిక సాయం అందజేత



వలిగొండ, జనవరి 20 (తొలి వెలుగు) : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామానికి చెందిన పల్లెర్ల మహేష్ కుమారుడు పల్లెర్ల యశ్వంత్ (9), కిడ్నీ సమస్యతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ విషాద సంఘటన నేపథ్యంలో బాధిత కుటుంబానికి గ్రామస్థులు ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన నాగిల్ల కృష్ణమూర్తి రూ.10,000లు, నక్కల మాధవరెడ్డి రూ.5,000లను బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ, ఇలాంటి కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జక్క దామోదర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్‌తో పాటు బుగ్గ మనోజ్, సంఘపాక మధు, బుగ్గ మల్లయ్య, పల్లెర్ల హరీష్, వేముల అశోక్, పల్లెర్ల యాదగిరి, సంఘపాక రవి, వేముల రామోజీ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేసిన రేషన్ డీలర్ల సంఘం



వలిగొండ, జనవరి 20 (తొలి వెలుగు) : వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ రేషన్ డీలర్ జూలకంటి శ్రీధర్ భార్య జూలకంటి సరస్వతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం తరపున రూ.50,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయాన్ని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జిల్లా డీఎస్ఓ రోజారాణి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సభ్యుల కష్టసుఖాల్లో అండగా ఉంటుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ దశరథ్, డీటీసీఎస్ బాలమణి, జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అలగల రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు సుర్వి వెంకటేశం గౌడ్, తోట సువర్ణ నర్సిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి సునీత శ్రీనివాస్, మోత్కూరు ఐఎంజీ పాయింట్ అధ్యక్షుడు సైదులు గుండాల, మండల అధ్యక్షుడు హరికిషన్, వలిగొండ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాశం స్వామి, కార్యదర్శి ఎం.డి. ఫరిదా జహంగీర్‌తో పాటు డీలర్లు కృష్ణారెడ్డి, స్వామి, అండాలు అంజయ్య పాల్గొన్నారు.

# చిన్నారుల బంగారు భవిష్యత్తుకు అంగన్‌వాడీలే పునాది







- మెరుగైన వసతులతో నూతన భవనాల నిర్మాణం
- ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు/యాదగిరిగుట్ట, జనవరి 20 (తొలివెలుగు): చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యా వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలే పునాది రాళ్లని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన అంగన్వాడి భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో సైదాపురం - 1, సైదాపురం - 2 అంగన్వాడి కేంద్రాల నూతన భవనాలను మంత్రి ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్ నిధులతో ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల చొప్పున నిర్మించిన ఈ భవనాలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ నూతన భవనాల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అంగన్వాడి వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం నూతన భవనాలను పరిశీలించిన మంత్రి చిన్నారులతో ముచ్చటించి, వారికి అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించి.. ప్రాణాలు కాపాడుకోండి

- ❖ తంగడపల్లి ఎక్స్ రోడ్డులో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం
- ❖ చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్




చౌటుప్పల్, జనవరి 20 (తొలి వెలుగు) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026' లో భాగంగా మంగళవారం తంగడపల్లి ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి



పరకాల,జనవరి 20 (తొలి వెలుగు) : హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలోని హరీష్ రావు గారిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రాజకీయ ప్రతీకార చర్యలపై పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఘాటైన హెచ్చరికలు చేశారు. మీ ఉడత ఊపులు, తాటాకు చప్పుళ్లకు హరీష్ రావు గారు భయపడతారని అనుకుంటే అది మీ అజ్ఞానం, భ్రమ మాత్రమేనని ఆయన అన్నారు. అక్రమంగా ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నిర్బంధాలు చేసినా అబద్ధాల మీద నిర్మించిన కాంగ్రెస్ రాజకీయ కోటను రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నేలమట్టం చేస్తుందని స్పష్టం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు గారు చట్టానికి గౌరవం ఇచ్చే నాయకుడని, విచారణలకు పిలిస్తే ఒక్కసారే కాదు ఎన్నిసార్లైనా హాజరవుతారని గుర్తుచేశారు. అయితే కేసుల పేరుతో, కుట్రలతో ప్రజల దృష్టిని మళ్లించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించవని హెచ్చరించారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముందుగా ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవాలని, కక్ష రాజకీయాలు కాదు, కేసుల రాజకీయాలు కాదు, ప్రజల సమస్యల పరిష్కారమే పాలన లక్ష్యంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ముందు గొప్పగా ప్రచారం చేసిన ఆరు గ్యారంటీలను ఇప్పటికైనా అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హరీష్ రావు గారి వెనుక ఒక్క వ్యక్తి కాదు, యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజల కోట్లాది గొంతుకలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీని, దాని నాయకత్వాన్ని భయపెట్టే ప్రయత్నాలను కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరిస్తూ, ప్రజా తీర్పే కాంగ్రెస్ రాజకీయాలకు అసలు రిమాండ్ అని చల్లా ధర్మారెడ్డి తేల్చిచెప్పారు.


Toli Velugu 21.01.26_Layout 1 1/21/2026 7:40 AM Page 4



# మహిళల ఆర్థిక ప్రగతికే ప్రభుత్వం పెద్దపీట

- ఆలేరులో రూ.16 కోట్లకు పైగా రుణాల పంపిణీ
- వడ్డీ లేని రుణాలతో మహిళల బలోపేతం
- చెక్కులు పంపిణీ చేసిన మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య





ఆలేరు, జనవరి 20 (తొలి వెలుగు) : రాష్ట్రంలోని మహిళలందరినీ ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మంగళవారం ఆలేరులోని వై.ఎస్.ఎన్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అందులో భాగంగానే స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో గత రెండేళ్లుగా మెప్మా ద్వారా స్త్రీ శక్తి, మహిళల ఆర్థిక బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా 375 మహిళా సంఘాలకు రూ.78,87,160 విలువైన వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ బ్యాంకులు, స్త్రీ నిధి సహకారంతో 179 సంఘాలకు రూ.15.29 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను అందజేశామని వివరించారు. అదేవిధంగా ఆలేరు మున్సిపాలిటీలో 176 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు, పట్టణంలోని 1065 మంది వీధి వ్యాపారులను గుర్తించి వారికి రుణాలు అందించామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ జాతీయ అధ్యక్షుడికి శుభాకాంక్షలు





చౌటుప్పల్, జనవరి 20 (తొలి వెలుగు) : భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నియమితులైన నితిన్ నబీన్‌కు చౌటుప్పల్‌లో బీజేపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ చౌటుప్పల్ మున్సిపాలిటీ, రూరల్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో జైశ్రీరామ్ నినాదాలతో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. నితిన్ నబీన్ నాయకత్వంలో పార్టీ మరింత దూకుడుగా ముందుకు సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా బిజెపిని మరింత బలోపేతం చేయడంలో ఆయన నియామకం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరంకొండ అశోక్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, భవనం మధుసూదన్ రెడ్డి, జిల్లా కమిటీ మాజీ ఉపాధ్యక్షులు రమణగొని శంకరయ్య, పోలోజు శ్రీధర్ బాబు, గుజ్జుల సురేందర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేశం, ఆలె చిరంజీవి, వనం ధనంజయ, పకీరు శ్రీనివాస్ రెడ్డి, బత్తుల జనార్ధన్, కడవేరు పాండు, ఉప్మాగుల నాగరాజు, జాల మల్లేశం, చేకూరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# తమ్ముడితో గొడవ.. అన్న అదృశ్యం - వెంకటరమణ కాలనీలో ఘటన



చౌటుప్పల్, జనవరి 20 (తొలి వెలుగు) : చౌటుప్పల్ పట్టణంలోని వెంకటరమణ కాలనీకి చెందిన గోశిక ఉదయ్ కిరణ్ (31), అనే యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. చేనేత వృత్తి చేసే ఉదయ్ కిరణ్ ఈ నెల 18న రాత్రి 9:30 గంటల సమయంలో తన తమ్ముడు సతీష్ చంద్రతో పని విషయంలో గొడవ పడ్డాడు. ఈ గొడవతో మనస్తాపానికి గురైన ఉదయ్ కిరణ్, “ఎక్కడైనా పని చేసుకుని బతుకుతా” అని చెప్పి అదే రోజు రాత్రి 10:30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. వెళ్లే సమయంలో తన సెల్‌ఫోన్‌ను కూడా ఇంట్లోనే వదిలి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి నరసింహ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయ్ కిరణ్ 5.5 అడుగుల ఎత్తు, చామన చాయ రంగు కలిగి ఉంటాడని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ పి. కరుణాకర్ రావు తెలిపారు. ఎవరికైనా ఉదయ్ కిరణ్ ఆచూకీ తెలిసినట్లయితే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# ప్రభుత్వానికి, ప్రజలకు మీడియా వారధి

- మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామ్ రెడ్డి
- ‘తొలివార్త’ క్యాలెండర్ ఆవిష్కరణ




చౌటుప్పల్, జనవరి 20 (తొలి వెలుగు) : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య మీడియా వారధిలా పనిచేస్తుందని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామ్ రెడ్డి అన్నారు. మంగళవారం చౌటుప్పల్ పురపాలక సంఘ కార్యాలయంలో ‘తొలివార్త’ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడంలో మీడియా పాత్ర కీలకమని కొనియాడారు. బాధ్యతాయుతమైన వార్తలతో ప్రజలను చైతన్యపరచాలని కోరారు. పత్రిక ప్రతినిధి కూచిమల్ల భగవంత్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు అంజయ్య, రఘుపతి, దీప, సాయి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ భూతం.. యువకుడి బలి

- అప్పుల భయంతో ఉరివేసుకుని ఆత్మహత్య
- తంగడపల్లిలో విషాదం



చౌటుప్పల్, జనవరి 20 (తొలి వెలుగు) : ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వ్యామోహం మరో నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. అప్పుల బాధ, కుటుంబ సభ్యులకు ఏం సమాధానం చెప్పాలో తెలియని ఆందోళనతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన చౌటుప్పల్ మండలం, తంగడపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలగోని శ్రీనివాస్ పెద్ద కుమారుడు పవన్ కుమార్ (27), పశువుల దాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. గతంలో పవన్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులు చేయగా, తండ్రి వాటిని తీర్చి మందలించారు. మంగళవారం మధ్యాహ్నం శ్రీనివాస్ భోజనానికి ఇంటికి రాగా, పవన్ ఉన్న గది తలుపులు తీయలేదు. అనుమానం వచ్చి పొరుగువారి సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా, పవన్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని కనిపించాడు. మళ్ళీ బెట్టింగ్‌లో అప్పులు చేసి ఉంటాడని, ఇంట్లో తెలిస్తే తిడతారనే భయంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని తండ్రి తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ కె. యాదగిరి తెలిపారు.

# మహిళలకు ‘ఇందిరమ్మ’ కానుక

- అల్లాపురంలో ఘనంగా చీరల పంపిణీ
- అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ మంజుల దిలీప్ రెడ్డి



చౌటుప్పల్, జనవరి 20 (తొలివెలుగు) : మహిళల సంక్షేమం, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఇందిరమ్మ’ చీరల పంపిణీ కార్యక్రమం అల్లాపురం గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ మండల పరిధిలోని అల్లాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి పాల్గొని, లబ్ధిదారులకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల పట్ల ప్రత్యేక గౌరవంతో ఈ పథకాన్ని అమలు చేస్తోందని కొనియాడారు. గ్రామంలోని అర్హులైన మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ కానుక మహిళల ముఖాల్లో చిరునవ్వులు నింపుతోందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు భూతం లింగస్వామి, యంజాల లింగస్వామి, సామ సుమిత్ర, గ్రామ కార్యదర్శి రజిత, వీఓ యంజాల రేణ, గ్రామ ప్రజలు, మహిళలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.